క్లుప్తంగా

రేపు ఆరాధన ఉత్సవాలు



సిద్దయ్యగారిమఠం

బ్రహ్మంగారిమఠం: సిద్దయ్య పెద్దకుమారుడు పెద్దపీరయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు మంగళవారం సిద్దయ్య మఠంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఉగాది సందర్భంగా ప్రతి ఏడాది పెద్దపీరయ్య స్వామి ఆరాధన ఉత్సవాలు నిర్వహించడం ఆనవాతీగా వస్తోంది. మంగళవారం రాత్రి సిద్దయ్యమఠంలో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, భజనలు, కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు. బుధవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సిద్దయ్యస్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న షబ్బీర్

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మహమ్మదీయ కాలనీకి చెందిన స్వర్ణకారుడు షేక్ షబ్బీర్ హుసేన్ ఆదివారం 300 మందికి రంజాన్ తోఫా పంపిణీ చేశారు. నూతన వస్త్రాలు, బియ్యం, చక్కెర, గోధుమపిండి, సేమియాలు, ఫిత్రాలను తన తల్లిదండ్రులు షేక్ హాజీసాహెబ్, ఖతీజాబీ జ్ఞాపకార్థం అందిస్తున్నట్లు షబ్బీర్ తెలిపారు. తొమ్మిదేళ్లుగా ప్రతి ఏడాది రంజాన్ సందర్భంగా కులమతాలకు అతీతంగా తాను సంపాదించిన దానిలో కొంత మొత్తంతో పేదలకు రంజాన్ తోఫాను అందిస్తున్నానన్నారు. యస్‌దాన్, ఖాజాహుసేన్, సమద్, ఫయాజ్, సమీవుల్లా, అబ్దుల్ రహమాన్, జావిద్, జాకిర్ పాల్గొన్నారు.

ఆటా-పాట అదుర్స్



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా బద్వేలు అనూష్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు తమ నృత్యాలతో అదుర్స్ అనిపించారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతోపాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివ ప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పరామర్శ

పెండ్లిమర్రి : మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనువాసులు ఈనెల 2వ తేదీన హత్యకు గురయ్యాడు. మృతుని కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు బంగారు నాగయ్యలు పరామర్శించి మృతుని చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉండి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనువాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, సాంబశివుడు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

చెన్నూరు : స్థానిక బస్టాండ్ సమీపంలో పీర్ల చావిడి వద్ద ఆదివారం నిర్వహించిన గంగమ్మ పెద్దమ్మ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన జాతర మహోత్సవం గోల పుల్లయ్య వీధిలో అమ్మవార్లను ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా మజ్జిగ మంచినీరు కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సీఐ పార్థసారథి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారికి బోనాలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలం నార్జంపల్లె గ్రామంలో అమ్మవారి జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పెద్దమ్మతల్లికి ఉదయమే భక్తులు బోనాలు పెట్టుకున్నారు. గ్రామంలో 21 సంవత్సరాల తరువాత పెద్దమ్మతల్లి జాతర నిర్వహిస్తుండటంతో గ్రామంలో ఏటు చూసినా సందడి నెలకొంది. పోలీస్ అధికారులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. జాతర సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి హాజరై పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆరోగ్య 'ఫలం'.. ఖర్జూరం

• రంజాన్ మాసంలో విస్తృత వినియోగం



కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసం గురించి తలుచుకోగానే ఖర్జూరపు పండు గుర్తుకు వస్తుంది. ఈ మాసంలో ఈ పండుకు గల ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. చూడగానే నోరు ఊరించే ఈ పండుకు అంతటి ప్రాధాన్యత ఎందుకు ఇస్తారో ముస్లిమేతరుల్లో చాలా మందికి తెలియదు. ఆహారానికి కులం, మతం ఉండదు గనుక ప్రకృతి ప్రసాదితమైన ఈ పండు గురించి అందరూ తెలుసుకోవచ్చు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అమృతఫలం ఖర్జూరం గురించిన కొన్ని వివరాలు...

ఎన్నో పోషకాలు గల ఫలం ఖర్జూరం. ప్రాచీనకాలం నుంచి ఆహార పదార్థాల్లో ఈ ఫలానికి ప్రత్యేక స్థానముంది. ఇస్లామిక్ సంప్రదాయ ఆహార పదార్థాలలో ఖర్జూరానికి పెద్దపీట వేశారు. మహా ప్రవక్త మహమ్మద్ (సొ.అ.వ) ఈ ఫలాన్ని ఎంతో ఇష్టపడేవారు. దాదాపు తేనెలాంటి రుచితోపాటు ఇందులో అన్ని రకాల పోషకాలు ఉండడంతో దీనికి అంతటి ప్రాధాన్యత లభిస్తోంది. అందుకే రంజాన్ మాసంలో రోజా (ఉపవాసం) దీక్ష విరమణలో ఈ ఫలం తప్పక ఉపయోగిస్తారు. ఈ పండుతో దీక్ష విరమించడం పుణ్యదాయకమని ముస్లింలు భావిస్తే, అంతేగాక దీనివల్ల పరిపూర్ణ ఆరోగ్యంతోపాటు శరీర సౌందర్యం కూడా పెరుగుతుందని అరబ్బులు విశ్వసిస్తారు.

అద్భుతం

ఖర్జూరంలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు ఉన్నాయి. ఆహార నిపుణులు, వైద్యులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ లాంటి ప్రకృతి సిద్ధమైన చక్కెర పదార్థాలు ఉండడంతో త్వరగా జీర్ణమై శరీరానికి తక్షణ శక్తినిస్తాయి. ఈ పండులో గుండెజబ్బును తగ్గించే గుణం కూడా ఉంది. రోజూ కొన్ని ఖర్జూరపు పండ్లను నానబెట్టి ఉదయాన్నే తింటే ఆరోగ్య సమతుల్యత ఏర్పడుతుంది. మలబద్ధకం సమస్య ఉన్న వారికి ఈ పండు మందులా ఉపయోగపడుతుంది. రోజూ ఖర్జూరాలు తింటే ప్రేవులు, జీర్ణకోశ, కాలేయ వ్యాధులు, నులి పురుగుల సమస్య ఉండదు.

శక్తివంతం

ఈ పండు సులభంగా జీర్ణమవడమే కాక శరీరానికి మంచి శక్తినిస్తుంది. పాలలో ఈ పండు గుజ్జును కలిపి ఇస్తే హెల్త్ డ్రింక్‌లా పని చేస్తుంది. బలహీనంగా ఉన్న వారు వేడి పాలలో వాడితే శరీర పుష్టి, ఆరోగ్యం చేకూరతాయి. స్త్రీలకు మంచి పోషకాహారం. రోజూ నాలుగు ఖర్జూరాలు క్రమం తప్పక గ్లాసు పాలతో తీసుకుంటే మంచిది. అంత స్థోమత లేని వారు కేవలం నాలుగు ఖర్జూరాలు తిన్నా సమతుల ఆహారం తీసుకున్నట్లే. ఖర్జూరం పండులో ఎన్ని ఔషధ గుణాలు ఉన్నాయో దాని గింజలో కూడా అంతే ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ గింజల పొడిని వెన్నెలో కలిపి తింటే గుండె జబ్బులు రావని ఆహార నిపుణులు పేర్కొంటున్నారు. నేరుగా చెట్టు నుంచి కోసుకుని అప్పటికప్పుడే తింటే ఈ పండు ఎంతో రుచిగా ఉంటుంది. వీటిని అలా పోసి నిల్వ చేస్తే త్వరగా చెడిపోతాయి. పండ్లలోని నీరు ఇగిరిపోయేలా ఎండలో ఉంచుతారు. దాంతో ఆ పండ్ల బరువు 35 శాతం తగ్గుతుంది. ఈ పండ్లు ఎక్కువగా తింటే వేడి చేస్తుందన్న భావన ప్రజల్లో ఉంది. కానీ ఇది కేవలం అపోహ మాత్రమే. దీనిని వేసవిలో కూడా.. ఇంకా చెప్పాలంటే సీజన్‌తో సంబంధం లేకుండా లభిస్తుంది.

100 గ్రాముల ఖర్జూరంలో..

315 క్యాలరీల శక్తి
5.3 శాతం నీరు
2.5 శాతం ప్రొటీన్లు
0.4 శాతం కొవ్వు
75.8 శాతం కార్బోహైడ్రేట్స్
120 మిల్లీ గ్రాముల క్యాల్షియం
50 మిల్లీ గ్రాముల పాస్పరస్
7.3 మిల్లీ గ్రాముల ఐరన్
మూడు మిల్లీ గ్రాముల సి-విటమిన్

ఇఫ్తార్ విందుతో మత సామరస్యం



కడప కార్పొరేషన్ : ఇఫ్తార్ విందులో ప్రార్థనలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ఇఫ్తార్ విందులతో అన్ని వర్గాల ప్రజల మధ్య సోదరభావం, మత సామరస్యం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక మాచుపల్లె ఘాట్‌లోని మసీద్ ఏ రియాజుల్ జిన్నాలో 28వ డివిజన్ కార్పొరేటర్ అరీఫుల్లా బాషా, నయీం, జాకీర్, జాబీర్‌ల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉపవాస దీక్షలు విరమించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశ్వశాంతి కోసం అల్లాహ్‌ను ప్రార్థించాలన్నారు. దైవారాధనకు, ధార్మిక చింతనకు, క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ప్రతీక అన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, కె.కొండయ్య, అజ్మతుల్లా, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉస్మాన్ మస్జిద్‌లో..

కడప కల్చరల్ : కడప నగరంలోని సబ్ జైల్ దగ్గర ఉన్న ఉస్మాన్ మస్జిద్‌లో పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసం మొత్తం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.



కడప కల్చరల్ : ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఉపవాస దీక్ష పరులు, ముస్లింలు

ఓటు హక్కు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రజాస్వామ్యం అత్యుత్తమమైన పాలనా విధానమని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైన ఉందని, కావున ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై ఓటు హక్కు అమ్ముకోకుండా సక్రమంగా వినియోగించుకోవాలని అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హన్మంతరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప ఎస్‌టీయూ భవన్‌లో అఖిల భారత అభ్యుదయ వేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేడు ఎన్నికలలో ప్రతి నియోజకవర్గంలో కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నారని, దీంతో సామాన్యుడు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా పోయిందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఓటుహక్కు విలువ తెలుసుకుని దానిని సక్రమంగా వినియోగించు కోవాలన్నారు. ప్రభుత్వాల పాలన ప్రజల అభివృద్ధికి తోడ్పాటేదిగా ఉండాలన్నారు. దేశ, రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీసే విధంగా సంక్షేమ కార్యక్రమాలు విపరీతంగా అమలు చేయడం మంచిది కాదన్నారు. అభ్యుదయ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సురేష్‌బాబు మాట్లాడుతూ రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు మాత్రమే కాదు, అభ్యర్థులు కూడా తమ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన మెనిఫెస్టోను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. అభ్యుదయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులు వల్ల ప్రజాభిప్రాయానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, సుధాకర్, హైదరవల్లి, గౌరీశంకర్, శ్రీనివాసులు, ఎన్నికల నిఘా వేదిక నాయకులు హారున్, దేవరశ్రీకృష్ణ, వెంకటస్వామి, కుమారస్వామి, రాజేష్, అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

హిమోఫీలియా వ్యాధిని అరికడదాం



హిమోఫీలియా వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కడప రూరల్ : హిమోఫీలియా వ్యాధిని అవగాహనతో అరికడదాం అని హైదరాబాద్ లిటిల్ స్టార్ చిల్డ్రన్స్ ఆసుపత్రి హెమటో అంకాలజిస్ట్ వైద్యులు రమణ దండమూరి అన్నారు. కడప చాప్టర్ హిమోఫీలియా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో వరల్డ్ హిమోఫీలియా డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హిమోఫీలియా అనే వ్యాధి జన్యుపరంగా వస్తుందన్నారు. ఇది రక్తానికి సంబంధించిన అరుదైన వ్యాధి అని తెలిపారు. శరీరంలో సాధారణంగా రక్తం గడ్డకట్టకుండా రక్తస్రావం జరగడం ఈ వ్యాధి లక్షణమన్నారు. ప్రతి వంద మందిలో ఒకరికి ఈ వ్యాధి వస్తుందన్నారు. జిల్లాలో ఈ వ్యాధిగ్రస్తులు 150 మంది ఉన్నారని అన్నారు. పుట్టిన బిడ్డలో చలనం లేకుండా, అవయవాలు అచేతనంగా ఉండడం ఈ వ్యాధి లక్షణమని తెలిపారు. ఈ లక్షణాలు కలిగిన వారిని హెమటాలజిస్ట్ (రక్త సంబంధిత) వైద్యులను సంప్రదించడం మంచిదన్నారు. కాగా ఈ వ్యాధికి ఇప్పుడు మెరుగైన మంచి మందులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ వ్యాధిగ్రస్తులకు కడప చాప్టర్ హిమోఫీలియా సొసైటీ వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టా కంపెనీ ప్రతినిధులు వ్యాధిగ్రస్తులకు విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సొసైటీ అధ్యక్షులు చప్పిడి క్రిష్ణారెడ్డి, సెక్రటరీ ప్రసాద్, వ్యాధిగ్రస్తులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్ అవినాష్‌రెడ్డిపై షర్మిల ఆధారాల్లేని ఆరోపణలు



వివేకానందరెడ్డి ప్రచార కార్యక్రమ ఫొటోలను చూపుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు: మాజీ వివేకానందరెడ్డి హత్య విషయంలో వైఎస్ షర్మిల అవినాష్‌రెడ్డిపై ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చీమకైనా హాని తలపెట్టని వైఎస్ అవినాష్‌రెడ్డి చట్టానికి వ్యతిరేకంగా ఎలాంటి పనిచేయరని పేర్కొన్నారు. ఎంపీగా 2019లో అవినాష్‌రెడ్డి పోటీ చేసినప్పుడు వివేకానందరెడ్డి ఆయన గెలుపు కోసం ముమ్మరంగా ప్రచారం చేశారని తెలిపారు. అవినాష్‌రెడ్డి గెలుపు కోసం వివేకానందరెడ్డి అహర్నిశలు కృషి చేశారని, అందుకు తానే సాక్ష్యమని గుర్తుచేశారు. వివేకానందరెడ్డి ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చూపించారు. వివేకానందరెడ్డిని అవినాష్‌రెడ్డి చంపించి ఉంటే స్థానికంగా ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, వివేక కుమార్తె సునీత ఆధారాలు లేని వ్యాఖ్యలు చేయడం సబబు కాదని హితవుపలికారు. వివేకా హత్య జరిగినప్పుడు ఆదినారాయణరెడ్డి మంత్రిగా, చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నారని, కేసును సీబీఐకి అప్పగించి విచారణ చేయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారని గుర్తు చేశారు.

వైఎస్ అవినాష్‌రెడ్డి గెలుపు ఖాయం

వైఎస్ కుటుంబానికి కీడు తలపెట్టిన కాంగ్రెస్ పార్టీలో షర్మిల ఎందుకు ఉన్నారని రఘురామిరెడ్డి నిలదీశారు. ఓదార్పు యాత్ర చేపట్టిన వైఎస్ జగన్‌పై కక్షగట్టి కేసులు పెట్టారని, 16 నెలలు జైలుకు పంపారని అన్నారు. ఈ విషయాలన్నీ షర్మిలకు తెలియదా అని ప్రశ్నించారు. తన అన్నను జైలుకు పంపించినందుకు కోపంతో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా షర్మిల పాదయాత్ర చేసి, జగనన్న వదిలిన బాణంగా పేరు తెచ్చుకున్నారని వివరించారు. జగన్‌కు వ్యతిరేకంగా బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ ఏకమయ్యాయని, ఎన్ని కూటములు ఎన్నికల్లో పోటీ చేసినా వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలు దక్కించుకుని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ అవినాష్‌రెడ్డి 2 లక్షల ఓట్ల మెజారిటీతో ఎంపీగా గెలుస్తాడని, జూన్ 4న ఈ విషయం తేలుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సే కవుల లక్ష్యం



కవులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : కవులు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తారని, ఉత్తమ సమాజం ఎలా ఉండాలో సూచిస్తారని, నైతిక విలువలతో కూడిన సమాజం ఆరోగ్యకరమైనదని భావిస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. ఈశ్వర్‌రెడ్డి అన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మునిరావు వీధిలోని సంస్థ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ ముందస్తు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ కవులు సమాజానికి దిశా నిర్దేశనం చేయగలరని, నిరంతరం సమాజ శ్రేయస్సు కోసమే తపిస్తారన్నారు. సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ టూరిజం సంస్థ సాంస్కృతిక విభాగం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, సంప్రదాయమైన పండుగలన్నింటినీ మతాలకు అతీతంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ ఉగాది సంప్రదాయాల్లో ప్రధానమైనది కవి సమ్మేళనమని, తమ సంస్థ కవులతో కొందరితో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, కేవీ రమణారెడ్డి, కల్లూరు బాల యల్లారెడ్డి, మధుబాబు ఉగాది కవితలను వినిపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విజయ్, బాబు, శివరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కవులను ఘనంగా సత్కరించారు.

ఆరోగ్యాన్ని అందరికీ కల్పించాలి



కడప ఎడ్యుకేషన్: కరపత్రాలను విడుదల చేస్తున్న ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్



కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ప్రసన్నలత

కడప ఎడ్యుకేషన్: ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ఆరోగ్యాన్ని అందరికీ కల్పించాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకరావాలని ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్, యూనియన్ ప్రతినిధి రామాంజులరెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జేవీవీ ప్రతినిధులు సునిత, బాలఓబన్న, శివారం, యూటీఎఫ్ నాయకురాలు సరస్వతి, హెల్త్ డిపార్టుమెంట్ నరసింహారెడ్డి, మధు, గోవిందులతో కలిసి కడప యూటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితి చూస్తుంటే చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దవారి వరకు జీవన విధానం, ప్రభుత్వాల అలసత్వం వల్ల ఆరోగ్యం మన చేతిలో ఉండటం లేదన్నారు. ప్రభుత్వాలు ఆరోగ్య రంగంలో ఖర్చు పెట్టాల్సినటువంటి నిధులను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు కంపెనీలను పోషించడానికి ఆయుష్మాన్ భారత్ అని, ఆరోగ్యశ్రీ అని కేవలం ఇన్సూరెన్స్‌ను మీకు కల్పిస్తున్నాయని అన్నారు. నిజంగా సామాన్యుడికి కావాల్సింది ఇన్సూరెన్స్ కాదని సరైన జీవన విధానం అన్నారు. అందరికీ ఆరోగ్యం కల్పించాలని ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల షుగర్, బీపీ, థైరాయిడ్, క్యాన్సర్, ఫ్యాటీ లివర్ వంటి దీర్ఘకాలిక రోగాలపై అవగాహన సదస్సులను నిర్వహిస్తుందన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలని అర్బన్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఆమె తన బృందంతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి వద్ద కోట్లాది రూపాయల ఆస్తులున్నా దానిని అనుభవించేందుకు ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ నియమిత ఆహార అలవాట్లను కలిగి ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అలాగే సాధారణ జీవనశైలి, ఉన్నత ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. కరోనా రక్కసిని గుర్తుకు తెచ్చుకుంటూ మానవ సంబంధాలు కొనసాగిస్తూ నైతిక విలువలతో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ వైద్యులు నవీద్, ప్రశాంతి, సౌమ్య, సుకన్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు సంవత్సరాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ కార్యవర్గ సభ్యులు ఆదివారం ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో నూతన తెలుగు నూతన సంవత్సరాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కళ్యా సుధాకర్ నూతన తెలుగు సంవత్సరాది క్యాలెండర్ తీసుకురావడంలో కృషి చేసిన రాష్ట్ర కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరూ సిరిసంపదలతో సుఖసంతోషాలతో గడపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు పల్లా నరసింహారావు, టేకూరి సుదర్శన్, ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, పల్లా మురళీకృష్ణయ్య, బాలచౌడన్న, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని వేదికపై ఆశీనులు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా కల్యాణం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు భస్మహారతి

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రదోశకాలంలో ఉజ్జయిని మహాకాళేశ్వరుని వలే పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు భస్మహారతి నిర్వహిస్తారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కొత్తమిద్దె రఘురామిరెడ్డి కోరారు.

ఘనంగా ముద్దల పండుగ



కోగటంలో పూజ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కమలాపురం : గంగమ్మ.. మమ్మల్ను చల్లగ చూడవమ్మా అంటూ భక్తులు స్థానిక మార్కెట్ వీధిలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లిని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచే కాక సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గంగమ్మకు బోనాలు తీసుకొచ్చి చల్ల ముద్దలు ఏర్పాటు చేసి, జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు ఇంటికి చేరి ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్థిల్లాలని మహిళా భక్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కోగటం, కె.అప్పాయపల్లె, జీవంపేట, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, పొడదుర్తి, ఎర్రబల్లె, నల్లింగాయపల్లె, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, సంబటూరు, జంభాపురం తదితర గ్రామాలలో ప్రజలు ఘనంగా ముద్దల పండుగ చేసుకున్నారు. బంధువులు, సన్నిహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

కోగటంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పూజలు

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోగటంలో పూజలు నిర్వహించారు. కోగటం గ్రామంలో నిర్వహించిన ముద్దల పండుగకు ఎంపీ హాజరయ్యారు. గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి మామ ప్రతాప్‌రెడ్డి, స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

ప్రొద్దుటూరు: స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులో నూరే హమ్జా మసీదులో మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. అల్యూమినియం దస్తగిరి ఆల్ అఫ్ యూ దివ్యాంగుల సొసైటీకి రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, శాంతినికేతన స్కూల్ కరస్పాండెంట్ షఫీ అహ్మద్, నూర్ బాషా సంఘం నాయకులు కల్లూరు రఫిక్, ఆల్ అఫ్ యూ దివ్యాంగుల సొసైటీ కన్వీనర్ అఫ్జల్, అబ్దుల్ రషీద్, హమ్జా మసీదు ముతవల్లి, మహబూబ్‌పీరా, ఆర్టీసీ పుల్లయ్య, మేస్త్రి సుబ్బరాయుడు, పీఎస్ అహ్మద్ బాషా, కొమ్మద్ది మౌలాలి, హుస్సేన్ వలి, యూసుఫ్ పాల్గొన్నారు.

సామగ్రి దగ్ధం

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పక్కన వ్యవసాయ పనిముట్లను తయారుచేసే కొలిమి వద్ద సామగ్రి అగ్నికి దగ్ధం అయింది. దీంతో రెండున్నర లక్షలమేర ఆస్తి నష్టం జరిగింది. బాధితుడు ఖాజాహుస్సేన్ తెలిపిన వివరాల మేరకు... వ్యవసాయ పనిముట్లకు సంబంధించి వివిధ రకాల పనిముట్లను తయారు చేసేందుకు యంత్రాన్ని అమర్చుకున్నట్లు తెలిపారు. శనివారం రోజు మాదిరే పనులను ముగించుకుని ఇంటికి వెళ్లామన్నారు. ఆదివారం కూలీలు రానందున తమ కొలిమికి తాళాలు వేశామని తెలిపారు. ఈక్రమంలో పక్కనే మలమూత్రాలకు వెళ్లే ఆకతాయిలు చెత్తాచెదారాలకు నిప్పుపెట్టడంతో ఈ సంఘటన జరిగి ఉంటుందన్నారు. స్థానికులు గమనించి ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పకముందే వ్యవసాయ పనిముట్లకు సంబంధించి కొయ్యలు, యంత్రాలు, బ్లోయర్, విద్యుత్ సామాన్లు బూడిదయ్యాయి.